# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 018
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
డిసెంబర్ 22, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





8లో..

## రాజ్యాంగ పరిరక్షణలో.. న్యాయవాదుల పాత్ర కీలకం

- జిల్లా జడ్జి పాటిల్ వసంత్
- ఘనంగా ఐఎల్ పీఏ తెలంగాణ 5వ రాష్ట్ర మహాసభలు



## అర్హుల జాబితా అందజేత

వరంగల్ తూర్పు జర్నలిస్టుల కోసం దేశాయిపేట లక్ష్మీ టౌన్ షిప్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ అర్హుల జాబితా సోమవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ కు అందజేశారు. వరంగల్ క్యాంప్ కార్యాలయంలో ఆయనను టీయూడబ్ల్యూజే (143) జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్, టీడబ్ల్యూజే(ఎఫ్) జిల్లా అధ్యక్షుడు జొక్కుల విజయ్ కుమార్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, టీఎస్జేయూ (ఎన్యూజే–ఐ) జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్ ఆధ్వర్యంలో అర్హుల జాబితాను అందజేశారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మురళీధర్ రావు దంపతులు నిర్ణయం మేరకు పది సంవత్సరాల కాలపరిమితి ప్రామాణికంగా తీసుకొని జాబితాను రూపొందించినట్లు వారు వెల్లడించారు. ఇటీవల జర్నలిస్టులతో జరిగిన మాటామంతిలో కొండా మురళీధర్ చెప్పిన నియమ నిబంధనల మేరకు నాలుగు యూనియన్ల ప్రతినిధులు కలిసి లిస్ట్ తయారు చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు కొండా మురళీధర్ రావు సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. త్వరలోనే జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లను అందజేస్తామన్నారు.

– వరంగల్ వాయిస్, కాశీబుగ్గ



8లో..

## ..అను నేను

- సర్పంచులుగా బాధ్యతల స్వీకరణ
- ముగిసిన ప్రత్యేక పాలన



8లో..

## రిటైర్మెంట్ బకాయిలు చెల్లించాలి

- పెన్షన్ వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి
- జాతీయ చైర్మన్ ఆర్ఎస్.శర్మ, సెక్రటరీ జనరల్ సుధాకర్




వివరాలు2లో..

# కాసులకోసం కక్కుర్తి




- మరుగుదొడ్ల పేరిట దోపిడీ
- రూ.10 కోట్లతో 88 నిర్మాణాలు
- వినియోగంలో ఉన్నవి పది శాతమే
- నరకాన్ని చూస్తున్న బాటసారులు
- రోడ్డు పక్కనే మూత్ర విసర్జన
- కంపు కొడుతున్న నగరం
- పట్టించుకోని మహానగరపాలక సంస్థ

వరంగల్ నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, జ్యువెల్లరీస్, అధునాతన కార్ల విక్రయాలకు వరంగల్ వేదికగా మారుతోంది. దీనికితోడు అనేక ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, పేరెన్నిక కలిగిన ఆస్పత్రులు ఇక్కడ వెలుస్తున్నాయి. దీంతో వివిధ పనులు, అవసరాల నిమిత్తం రోజూ చుట్టు పక్కల గ్రామాలనుంచి వరంగల్ నగరానికి వచ్చేవాళ్లు వేల సంఖ్యలోనే ఉంటున్నారు. దూర ప్రాంతాలనుంచి వచ్చే వారికి ఒకటి, రెండు వస్తే నరకమే అన్నట్లుగా మారింది నగరంలోని పరిస్థితి. అక్కడక్కడా ప్రజా మరుగుదొడ్లు కనిపించినా అక్కడినుంచి వచ్చే కంపునకు దరిదాపుల్లోకి కూడా వెళ్లలేక పోతున్నారు. రూ.10 కోట్లతో 88 మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు బల్దియా అధికారులు లెక్కలు చెబుతున్నా పనిచేస్తున్నవి మాత్రం వేళ్ల మీద లెక్కించవచ్చు. బల్దియా పాలకవర్గం కాసుల కోసం కక్కుర్తి పడి ఇష్టానుసారంగా మరుగుదొడ్లు నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కట్టించిన వాటిలో ఇప్పటికే కొన్నింటిని వివిధ కారణాలతో కూల్చి వేయగా మరికొన్ని ప్రాంతాల్లో నిర్వహణను గాలికి వదలడంతో వాటికి వేసిన తాళాలు తెరుచుకోవడంలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పలువురు రోడ్డు పక్కనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మూత్ర శాలలను ఏర్పాటు చేయడం ద్వారా కొంతైనా ప్రయోజనం చేకూరుతుంది. అదే విధంగా మరుగుదొడ్ల పేరిట జరిగిన దోపిడీపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయించాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి





# కాసులకోసం.. కక్కుర్తి

- మరుగుదొడ్ల పేరిట దోపిడీ
- రూ.10 కోట్లతో 88 నిర్మాణాలు
- వినియోగంలో ఉన్నవి పది శాతమే
- నరకాన్ని చూస్తున్న బాటసారులు
- రోడ్డు పక్కనే మూత్ర విసర్జన
- కంపు కొడుతున్న నగరం
- పట్టించుకోని మహానగరపాలక సంస్థ

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** కాదేదీ కాసుల కక్కుర్తికి అనర్హం అన్నట్లుగా మారింది గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిస్థితి. పైసలకోసం అడ్డమైన పనులు చేసేందుకు కూడా వెనుకాడడంలేదు. వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారి అత్యవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేయాల్సిన మరుగుదొడ్ల నిర్మాణంలోనూ పెద్ద మొత్తంలో చేతులు మారాయన్న విమర్శలున్నాయి. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన ప్రజా మరుగుదొడ్లు స్థలాల లేమి పేరుతో ఇష్టారాజ్యంగా నిర్మించారు. పట్టణ ప్రగతి నిధులతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1200 సీట్లతో 175 పబ్లిక్, మూడు కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మించాలని ప్రతిపాదించినా అందులో సగం కూడా పూర్తి చేయలేదు.

**రూ.10 కోట్లకు పైనే డ్రా..**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 175 పబ్లిక్ టాయిలెట్లు, మూడు కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మించినట్లు లెక్కల్లో చూపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందుకు గాను రూ.10 కోట్లకు పైనే ఖర్చు చేసినట్లు లెక్కలు చూపించారు. అయితే ఇందులో కేవలం 88 నిర్మాణాలు మాత్రమే పూర్తయినట్లు సమాచారం. అసలే లేని టాయిలెట్లలో 75 పబ్లిక్ టాయిలెట్లు, ఒక కమ్యూనిటీ టాయిలెట్ నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించారు. రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా ఏడు పబ్లిక్ టాయిలెట్లు, ఒక కమ్యూనిటీ టాయిలెట్ ను థర్డ్‌జండర్ గ్రూపులకు, మరో ఏడు దివ్యాంగుల సంఘాలకు అప్పగించారు.

**నిర్వహణకు రూ.6 కోట్లు..**

ఫ్రీ ప్యాబ్రికేటెడ్ నిర్మాణాలు అంటూ నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రజా మరుగుదొడ్లలో సగం కనుమరుగయ్యాయి. ఉన్నవాటిలో కొన్ని పని చేయడం లేదు. మరికొన్ని అపరిశుభ్రంగా మారి చెత్త కుప్పలను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజావసరాలకు అడ్డుగా ఉద్దంటూ తొలగించగా మరికొన్ని ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలకు ధ్వంసం అయ్యాయి. అయినప్పటికీ ప్రతి నెల ఒక్కో సీటు (బేషన్) కు రూ.2,500 చొప్పున లెక్కగట్టి ట్రై సిటీలోని మొత్తం మరుగుదొడ్ల పేరిట రూ.50 లక్షల వరకు బల్దియా ఖర్చుచేస్తోంది. ఇందులోనూ పెద్ద మొత్తంలో నిధులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**రోడ్డు పక్కనే మూత్ర విసర్జన..**

ప్రతి ఏడు మరుగుదొడ్ల పేరిట రూ.6 కోట్లకు పైగానే ఖర్చు చేస్తున్నా నగరంలో ఆశించిన ఫలితం రావడంలేదు. వివిధ ప్రాంతాలనుంచి నగరానికి వచ్చే వారు ఒకటికి పోవాలంటూ రోడ్డు పక్కనున్న మురుగు కాలువనే ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో నగరాన్ని స్వచ్ఛ నగరంగా ఉంచాలన్న అధికారుల ఆరాటం ఆవిరైపోతోంది. ఇప్పటికైనా మరుగుదొడ్ల పేరిట పక్కదారి పడుతున్న నిధుల విషయంలో విజిలెన్స్ ఎంక్వైరీ చేయించడంతోపాటు నగరంలోని రద్దీ ప్రాంతాల్లో మూత్ర శాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## ‘అక్రెడిటేషన్’ లకు కొత్త నిబంధన

☐ జీవో విడుదల చేసిన ప్రభుత్వం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇచ్చే మీడియా అక్రెడిటేషన్ కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2016 నాటి పాత నిబంధనలను రద్దు చేయడంతోపాటు ‘తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025’ను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 252 జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కమిటీల పదవీ కాలం రెండేళ్లుగా నిర్ణయించారు. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాత కమిటీలే కొనసాగుతాయి. అక్రెడిటేషన్ కార్డు ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే ఈ కార్డులు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందేందుకు మాత్రమే పనికివస్తాయన్నారు. డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రెడిటేషన్ ఇవ్వాలంటే సదరు వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం ఐదు లక్షల మంది విజిటర్స్ ఉండాలి. రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ మీడియా కేటగిరీలో గరిష్టంగా 10 కార్డులు మాత్రమే ఇస్తామని ప్రకటించారు. కనీసం రెండు వేల ప్రతులు పంపిణీ అవుతున్న దినపత్రికలే అక్రెడిటేషన్‌కు అర్హులన్నారు. సదరు పత్రికలకు పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. శాటిలైట్ ఛానళ్లు 50శాతం వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం మూడు బులెటిన్లు టెలికాస్ట్ చేయాలని పేర్కొన్నారు. స్టేట్ లెవల్ అక్రెడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరిగా చేశారు. 15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

**కమిటీల నిర్మాణం..**

రాష్ట్ర కమిటీకి మీడియా అకాడమీ చైర్మన్ గా వ్యవహరిస్తున్న వ్యక్తే చైర్మన్‌గా, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులు, పీసీఐ సభ్యులు ఉంటారు. జిల్లా కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీపీఆర్వో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అయితే అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుందని కొత్త జీవోలో పేర్కొన్నారు.

## పూర్వ ఏసీపీతో సహా మరో ఇద్దరు సస్పెన్షన్

☐ ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ

**వరంగల్ వాయిస్, క్రైం :** గతంలో వరంగల్ ఏసీపీగా విధులు నిర్వహించిన నందిరాం నాయక్ తో పాటు ప్రస్తుతం సీసీఎస్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న గోపి, ఎస్సై విఠల్ ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పోలీస్ డీజీపీ శివధర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసే సమయంలో మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో తప్పుడు కేసులు నమోదు చేసినట్లుగా ఫిర్యాదురావడంతో దీనిపై విచారణ జరిపి అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేయడం జరిగింది.



**393.100 కిలోల గంజాయి ధ్వంసం..**

ఈగిల్ ఫోర్స్ (తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో), హైదరాబాద్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు సోమవారం డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ ఆర్.గిరిధర్, డ్రగ్ డిస్పోజల్ కమిటీ & ఎస్పీ (ఈస్ట్), హైదరాబాద్ పి.కృష్ణమూర్తి, అదనపు ఎస్పీ (అడ్మిన్), (డ్రగ్ డిస్పోజల్ మెంబర్), హైదరాబాద్ ఎన్.బుచయ్య, డీఎస్పీ (డ్రగ్ డిస్పోజల్ మెంబర్), హైదరాబాద్ పి.రమేష్ కుమార్, ఎస్హెచ్ఓ వారి ఆధ్వర్యంలో వరంగల్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ లో నమోదైన మూడు కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.1.96కోట్ల విలువైన సుమారు 393.100 కిలోల గంజాయిని హనుమకొండ జిల్లా, అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్ లో ధ్వంసం చేశారు. ఈ డ్రగ్స్ ధ్వంస ప్రక్రియ లో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.రవీందర్, కె. శ్రీకాంత్, సబ్-ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ కె.కుమారస్వామి, పి.మొగిలి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## వెడ్డింగ్ ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో చక్రపాణికి అవార్డు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** హనుమకొండ జిల్లాలోని కాలోజీ కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన 50 సంవత్సరాల వరంగల్ డిస్ట్రిక్ట్ ఫొటోగ్రఫీ గోల్డెన్ జూబిలీ వేడుకలో భాగంగా వెడ్డింగ్ ఫొటోగ్రఫీ కాంపిటీషన్ లో ఉర్సు ప్రాంతానికి చెందిన పూస చక్రపాణి (వరలక్ష్మి డిజిటల్ స్టూడియో) సిల్వర్ మెడల్ తో పాటు రూ.5 వేలు క్యాష్ ప్రైజ్ అందుకున్నారు. ఈ 50 ఏళ్ల ఘనమైన వేడుకలు నా జీవితంలో ఒక మరపురాని అనుభవంగా నిలిచిపోతాయని అవార్డు గ్రహీత చక్రపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడీన్ లింగమూర్తి, వరంగల్ జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. చక్రికి అవార్డు రావడం పట్ల మాటి దిలీప్, వనం శరత్ బాబు, ఆవునూరి కుమార్, బైరి నాగరాజు, బొల్లెపల్లి రాజు, తాళ్లపెల్లి అఖిల్, గుడిమెల్ల సురేష్, వనం నవీన్, మాచర్ల ప్రసాద్, అడ్డూరి దిలీప్, మోర దిలీప్, సోను తదితరులు అభినందనలు తెలిపారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, డిసెంబర్ 22, 2025

# లింగాయత్ సమాజ అభివృద్ధికి నడుం బిగించాలి

◆ అధ్యక్షుడు పట్నంశెట్టి వీర సోమయ్య
◆ జిల్లా యువజన, మహిళా కమిటీల ఎన్నిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వీరశైవ లింగాయత్ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మహిళా, యువజన విభాగాల భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా సంఘం అధ్యక్షులు పట్నంశెట్టి వీర సోమయ్య అన్నారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లో జిల్లా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి యువజన మరియు మహిళా కమిటీ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన యువజన కమిటీలో అధ్యక్షుడిగా వుప్పు శివకుమార్ (సునీల్), వర్కింగ్ ప్రెసిడెంట్ వుప్పు ఆశిష్, ప్రధాన కార్యదర్శి కొలగాని సాయి, ఉపాధ్యక్షులు వుప్పు రాకేష్, తిక్క ధనుష్, కోశాధికారి రాచర్ల సాయి, సంయుక్త కార్యదర్శులు వెన్న ఉదయకుమార్, మాచపత్రి మనోజ్,



ప్రచార కార్యదర్శి: వుప్పు మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులు దుర్గం రాకేష్, వుప్పు పున్నంచందర్, వుప్పు వంశీ, దార శ్రవణ్, తిక్క శ్రీకర్‌లు ఎన్నికయ్యారు. నూతన మహిళా కమిటీలో అధ్యక్షురాలిగా బానాల శ్రీగౌరి, ప్రధాన కార్యదర్శి సాయం ఉష, ఉపాధ్యక్షులు కొలగాని శోభ, వుప్పు సమత, సంయుక్త కార్యదర్శి దుర్గం అనిత, కార్యవర్గ సభ్యులుగా వుప్పు శ్రీలత, పట్నంశెట్టి నిర్మల, వుప్పు భాగ్యలక్ష్మి, మహాదేవుని సుహాసిని, వుప్పు లావణ్య, తిక్క కృష్ణవేణిలనె ఎన్నికున్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన జిల్లా సంఘ గౌరవ సలహాదారులు, రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు గుండవరం విధుమౌళి నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను అభినందించారు. మహాత్మా బసవేశ్వరుని ఆశయాలకు అనుగుణంగా అందరూ సమన్వయంతో కలిసి పనిచేస్తూ, లింగాయత్ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 23న రాష్ట్ర కార్యవర్గ సమావేశం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. హిమాయత్ నగర్‌లోని రాజ బహదూర్ గౌర్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 17శాతం రిజర్వేషన్లే ప్రకటించినప్పటికీ, అగ్రకులాల ఆధిపత్యాన్ని, అక్రమాలను ఎదుర్కొని బీసీలు సాధించిన విజయాలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుపై చర్చించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు తీరని ద్రోహం చేశాయని ఆయన మండిపడ్డారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీ కోటా, జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు వంటి అంశాలు పార్లమెంట్‌లో చర్చకు రాకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాల అమలుతో పాటు, ఇతర బీసీ డిమాండ్ల సాధనకై ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆహ్వానితులు అందరూ సకాలంలో ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## గ్రామాల్లో సర్పంచుల ప్రమాణ స్వీకారం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో నూతనంగా ఎన్నికైన పాలక మండలులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని కమలాపూర్, ఉప్పల్, దశరాజు పల్లి, శంభునిపల్లి గ్రామపంచాయతీల నూతన పాలక మండలి సభ్యులు ఈ రోజు పదవీ బాధ్యతలు చేపట్టారు. అధికారుల సమక్షంలో సర్పంచులు, వార్డు సభ్యులు రాజ్యాంగబద్ధంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పక్షపాతాలకు తావులేకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంలో ప్రజాప్రతినిధులు ముందుండాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఆమె శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, మండల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పల్లవి ఎంపిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు సాఫ్ట్‌బాల్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12న వరంగల్ ఓసిటీ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు రాణించి తదుపరి దశకు అర్హత సాధించారు. అనంతరం ఈ నెల 18 నుంచి 21 వరకు ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైతం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా జట్టులో చోటు సంపాదించారు. ఈ విజయాల ఫలితంగా, ఈ నెల 23 నుంచి 25 వరకు మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో జరగనున్న 38వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు వరంగల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన డీఎస్.సింధు (6వ తరగతి), జి.నందిని (6వ తరగతి)తో పాటు వారికి శిక్షణ నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రశాంత్‌ను పాఠశాల చైర్మన్, కరెస్పాండెంట్ రాచకొండ అశోకచారి హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని" ఆకాంక్షించారు. ఈ విజయం పాఠశాలలో క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ జి.మహేందర్, కోశాధికారి కోటగిరి రమేష్, స్పోర్ట్స్ ఇంచార్జ్ ఆకుల రాజు, యాజమాన్య ప్రతినిధులు జయంత్, అశోక్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పుట్టినరోజున ఆదర్శం చాటిన చిన్నారి

### ఆరో ఏటనే ఠాకూర్ వేద్ నరేన్ సేవా నిరతి

### విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సాధారణంగా పుట్టినరోజు అంటే ఆడంబరంగా వేడుకలు చేసుకుంటారు. కానీ, ఆ చిన్నారి మాత్రం తన పుట్టినరోజు వేడుకను తోటి విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు పూయించడానికి వేదికగా మార్చుకున్నాడు. హైదరాబాద్‌లోని కొండాపూర్ (మై హోమ్ మంగళ)లో నివసిస్తూ, చిరెగ్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న ఠాకూర్ వేద్ నరేన్ తన 6వ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను బహుకరించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. సోమవారం వేద్ నరేన్ పుట్టినరోజు కావడంతో, అతని తల్లిదండ్రులు ఠాకూర్ సుకేషిని బాయి – త్రిలోక్ సింగ్ దంపతుల సూచన మేరకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. వేద్ మామయ్య, సీనియర్ జర్నలిస్ట్ ఠాకూర్ రాజేందర్ సింగ్, అత్తమ్మ అనిత (హిందీ టీచర్) ప్రోత్సాహంతో డోర్నకల్ మండల కేంద్రంలోని పీయం శ్రీ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న 15 మంది ప్రతిభావంతులైన క్రీడా విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. చిన్న వయసులోనే సేవా దృక్పథం కలిగి ఉన్న వేద్ నరేన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు మనస్ఫూర్తిగా అభినందించారు. అతనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేషుకుమారి, శంకరయ్య, వరలక్ష్మి, మంజులత, సమిత, విద్యాసాగర్, రమేష్, వసంతరాణి, సీతారాములు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీ.హెచ్. మహేందర్ జి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావుతో కలిసి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 35 దరఖాస్తులు రాగా, భూ సంబంధిత సమస్యలు 08, పెన్షన్లు 06, గృహ నిర్మాణ శాఖ 04, ఇతర శాఖలు 17లు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్, వాటిని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

## వైభవంగా గణిత దినోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని హన్మకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రంపై తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన వివిధ రకాల నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొడారి భాస్కర్ రెడ్డి ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 45 రకాల గణిత నమూనాలను ప్రదర్శించి, వాటి వెనుక ఉన్న సూత్రాలను వివరించారు. అనంతరం నిర్వహించిన గణిత క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు గజ్వేల్లి పూర్ణచందర్, నల్ల అమితా దేవి, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధియే రాష్ట్ర ప్రగతికి పునాది

### సర్పంచ్ లకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొంది, నేడు పదవీ బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.ధనసరి అనసూయ (సీతక్క) హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని ఎన్నికైన ప్రజాప్రతినిధులు, తమ గ్రామాల అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి సూచించారు. "గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. పారదర్శకమైన పాలన అందిస్తూ, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉంది" అని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు సజావుగా సాగాలంటే సర్పంచులు, వార్డు సభ్యులు సమన్వయంతో, సమిష్టిగా పనిచేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా తెలుసుకోవాలి. సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకత్వాన్ని అందించాలి. రాజకీయాలకు అతీతంగా గ్రామ శ్రేయస్సు కోసం పాటుపడాలి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, నిధుల వినియోగం మరియు గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో ప్రజాప్రతినిధులు ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె భరోసా ఇచ్చారు. నూతనంగా కొలువుదీరిన పాలకవర్గాలు పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

## కోలి-ముదిరాజ్ సమాజం దేశానికే మూలస్తంభం

### ◆ జాతీయ కార్యవర్గ సమావేశంలో వక్తలు



**వరంగల్ వాయిస్, బెంగళూరు :** అఖిల భారతీయ కోలి సమాజ్ ముదిరాజ్ (ఆర్) ఆధ్వర్యంలో కర్ణాటక రాజధాని బెంగళూరులో నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశాలు డిసెంబర్ 20, 21 తేదీల్లో అత్యంత ఘనంగా జరిగాయి. కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు దత్తాత్రేయ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు మల్కాజగిరి ఎంపీ, తెలంగాణ మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి కోలి-ముదిరాజ్ సంఘ నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశానికి తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ ముదిరాజ్ అధ్యయన పరిశోధకులు సోనబోయిన సతీష్ ముదిరాజ్ ఈ సమావేశంలో పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కోలి సమాజం సింధు లోయ నాగరికత కాలం నాటి ప్రాచీన సమాజమని, వీరు భారతదేశపు మూల నివాసులని ఆయన వివరించారు. గౌతమ బుద్ధుడు, చక్రవర్తి అశోకుడు, రాజు మాంధాత, వాల్మీకి మహర్షి, సంత్ కబీర్, వీరనారి ఝల్కారీ బాయి వంటి వారు కోలి సమాజానికి చెందినవారని గుర్తుచేశారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్న ఈ సమాజం.. ప్రాంతీయ భాషల ప్రభావంతో క్షత్రియ కోలి, కోలి రాజ్‌పుత్, కోలి మహాదేవ్, కోలి ఠాకూర్ వంటి అనేక ఉపవర్గాలుగా గుర్తింపు పొందిందని తెలిపారు. తెలుగులో మొట్టమొదటి శాసనమైన కలమల్ల శాసనం కడప జిల్లాలోని ఎరికల్ ముత్తరాజు ధనుంజయ రాజు వేయించిందని, అలాగే చక్రవర్తి పెరుంబిడుగు ముత్తరైయర్-II స్మారక పోస్టల్ స్టాంపు ప్రాధాన్యతను ఆయన వివరించారు. తెలంగాణలో ముదిరాజుల సామాజిక-ఆర్థిక పరిస్థితులు, విద్య, వృత్తి జీవనం, భవిష్యత్ అభివృద్ధి దిశలపై సతీష్ ముదిరాజ్ విపులంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఆయనను శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశం అఖిల భారతీయ కోలి-ముదిరాజ్ సమాజ ఐక్యతకు, భవిష్యత్ కార్యాచరణకు బలమైన పునాది వేసిందని జాతీయ నాయకులు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న కోలి-ముదిరాజ్ సమాజాన్ని ఒక్కతాటిపైకి తెచ్చేందుకు ఇలాంటి సదస్సులు దోహదపడతాయని పేర్కొన్నారు.

## పెద్దకోడపాక -పరకాల హైవే రోడ్డును వెంటనే నిర్మించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** పెద్దకోడపాక గ్రామం నుంచి పరకాల హైవేలోని లలిత రెస్టారెంట్ వరకు అధ్వానంగా మారిన రోడ్డును తక్షణమే పునర్నిర్మించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం శాయంపేట మండలం పెద్దకోడపాక గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ఈ రోడ్డు మార్గం పూర్తిగా గుంతలమయమైందని, దీనివల్ల వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో రైతులు తమ పంట పొలాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నా, గత పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కొత్త ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి వెంటనే నిధులు మంజూరు చేసి నూతన రోడ్డు నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో గ్రామస్తులను ఏకం చేసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మంద మధు, మంద అశోక్, మంద రాజ్ కుమార్, సందీప్, పవన్ కుమార్, అరుణ్ రాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన కొత్త సర్పంచులు..



### ▪ గ్రామాల్లో పండుగ వాతావరణం

**వరంగల్ వాయిస్, డోర్నకల్:** రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు చేసిన ఏర్పాట్ల మధ్య ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 1,205 ఏకగ్రీవాలతో కలిపి మొత్తం 12,702 మంది సర్పంచులు, అలాగే 25,848 ఏకగ్రీవాలతో కలిపి మొత్తం 1,11,803 మంది వార్డు సభ్యులు కొత్తగా కొలువుదీరారు. వార్డు సభ్యుల ఎన్నిక అనంతరం ఉప సర్పంచుల ఎన్నిక ప్రక్రియ ముగియడంతో, సోమవారం వారందరిచే అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటివరకు గ్రామాల్లో కొనసాగిన ప్రత్యేకాధికారుల పాలన ముగియడంతో, వారు నూతన సర్పంచులకు బాధ్యతలను అప్పగించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రమాణ స్వీకారం చేసిన ప్రధాన ప్రజాప్రతినిధులు చిల్కోడు సర్పంచ్ రాయల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రమనబోయిన రాజు, ఉయ్యాలవాడ సర్పంచ్ భానోత్ శ్యాంబాబు, ఉప సర్పంచ్ నర్సింహా రావు, వెన్నారం సర్పంచ్ జక్కలు కౌసల్య, కస్నతండా సర్పంచ్ శంకర్, చాంప్లతండా సర్పంచ్ భానోత్ రంగమ్మ పాండు నాయక్, ఉప సర్పంచ్ భానోత్ కిషోర్, బంజరా సర్పంచ్ మలిగిరెడ్డి మన్నెమ్మ, ఉప సర్పంచ్ ఎరజెర్ల రాంబాబు, హున్యతండా సర్పంచ్ బానోత్ కాశీరాం, ఉప సర్పంచ్ ధరావత్ రాందాస్ లు ఉన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాల సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## పారదర్శకతకే ఎరువుల బుకింగ్ యాప్



**వరంగల్ వాయిస్, జనగామ :** రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకత పెంచేందుకు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎరువుల బుకింగ్ యాప్'ను ప్రతి రైతు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. సోమవారం జనగామ పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యాప్ ద్వారా జరుగుతున్న విక్రయాలను, సంబంధిత రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. యూరియా అమ్మకాల రిజిస్టర్‌లో కొత్తగా 'బుకింగ్ ఐడీ' అనే కాలాన్ని ఏర్పాటు చేసి, ప్రతి విక్రయానికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ డీలర్లను ఆదేశించారు. యాప్ ద్వారా రైతులు తమకు కావాల్సిన ఎరువులను ముందుగానే బుక్ చేసుకోవచ్చని, దీనివల్ల దుకాణాల వద్ద గుమిగూడాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ఒకే రైతు పదేపదే ఎరువులు కొనుగోలు చేయకుండా నిరోధించవచ్చని, తద్వారా నిజమైన రైతులకు సకాలంలో ఎరువులు అందుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ అపర్ణ, టెక్నికల్ ఏఓ శరత్ చంద్ర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి రాజకీయాలు అడ్డుకాకూడదు

### ▪ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
### ▪ ఘనంగా గణపురం మేజర్ పంచాయతీ పాలక మండలి ప్రమాణ స్వీకారం



**వరంగల్ వాయిస్, గణపురం :** నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి అంకితమై ప్రజల మన్ననలు పొందాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. సోమవారం గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన కటుకూరి రాధికా శ్రీనివాస్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. ప్రజాప్రతినిధులు సేవా దృక్పథంతో పనిచేసి తమ పదవులకు న్యాయం చేయాలన్నారు. అయితే, మండలంలో తాను మంజూరు చేసిన పలు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేసేలా సర్పంచులు, స్థానిక నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్నికైన సర్పంచులందరికీ గ్రామ అభివృద్ధి విషయంలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ రాధికా శ్రీనివాస్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రేపాక రాజేందర్, మాజీ ఎంపీపీ వి.నారాయణ, మాజీ కోఆప్షన్ సభ్యులు చోటే మియా, ఎం.మల్లికార్జున్, వి.రాజమౌళి, డి.శంకర్, జి.సత్యనారాయణ రెడ్డి, డి.దుర్గయ్య, పంచాయతీ కార్యదర్శి విజేందర్, మాజీ సర్పంచ్ ఎన్. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు తావులేకుండా అభివృద్ధి

■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో రాజకీయాలకు తావులేకుండా నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం 7వ డివిజన్ పరిధిలో రూ.100 లక్షల (కోటి రూపాయల) అంచనా వ్యయంతో చేపట్టనున్న సైడ్ డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, పబ్లిక్ గార్డెన్‌లో చిన్నారుల ఆట వసతుల కల్పన పనులకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఉన్న వార్డులను పూర్తిగా విస్మరించారని, కనీసం రూ.50 లక్షలు కూడా కేటాయించలేదని విమర్శించారు. కానీ, నేడు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి వార్డుకు పార్టీలతో సంబంధం లేకుండా రూ.5 కోట్లపైగా నిధులు కేటాయించి పనులను పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ, కార్పొరేషన్, ఎమ్మెల్యే నిధులను సమన్వయం చేస్తూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే కాకాజీ కాలనీలో పర్యటించి స్థానిక డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అభివృద్ధి పనులు సాఫీగా సాగాలంటే ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, కొన్ని చోట్ల స్థానికులు అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, యూత్ నాయకులు తోట పవన్, మాజీ కార్పొరేటర్ శేఖర్, సోమ నాగేశ్వర్ రావు, బిన్నీ లక్ష్మణ్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి గాంధీ పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**భూపాలపల్లి జిల్లా ఎస్పీ సంకీర్త్**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ప్రజా దివాస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా దివాస్' కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ రోజు ప్రజా దివాస్‌లో మొత్తం 10 దరఖాస్తులు రాగా, ఎస్పీ వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఆయా ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి జాప్యం చేయకూడదని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సమగ్ర విచారణ జరిపి, బాధితులకు భరోసా కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసాన్ని పొందేలా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే మన ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రజా దివాస్ ద్వారా వచ్చిన ప్రతి అర్జీని కంప్యూటర్ సెక్షన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఎస్పీ వెల్లడించారు.

# గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం శాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శాయంపేట, పత్తిపాక, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు మరియు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజాప్రతినిధులు, వారి ఆశయాలను నెరవేర్చేలా నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. శాయంపేట మండలంలోని మిగతా గ్రామాల్లో కూడా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాలు పండుగ వాతావరణంలో జరిగాయి. ఆయా గ్రామాల్లో మండల అధికారులు పర్యవేక్షించి బాధ్యతల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మచ్చాపూర్‌లో 'హ్యాట్రిక్' సర్పంచ్ ప్రమాణ స్వీకారం

- వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మానస
- ఘనంగా సన్మానించిన జిల్లా పెరిక కుల సంఘం



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామ సర్పంచ్‌గా బోడకుంట్ల మానస సోమవారం వరుసగా మూడోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. మచ్చాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. సర్పంచ్ మానసతో పాటు వార్డు సభ్యురాలు పత్తిపాక రాజమణి, ఇతర పాలకవర్గ సభ్యులు అధికారుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. వరుసగా మూడుసార్లు సర్పంచ్‌గా గెలిచి హ్యాట్రిక్ సాధించిన బోడకుంట్ల మానస-ప్రకాశ్ దంపతులను, అలాగే వార్డు సభ్యురాలు పత్తిపాక రాజమణి-లింగమూర్తి దంపతులను వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం ఘనంగా సత్కరించింది. జిల్లా సంఘం అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో సంఘం నాయకులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మానస మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వరుసగా మూడోసారి అవకాశం కల్పించిన మచ్చాపూర్ గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగిస్తూ, గ్రామాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మచ్చాపూర్ మాజీ సర్పంచ్ నరిశెట్టి నరేందర్, పత్తిపాక నారాయణ, లింగమూర్తి, అర్సం యాకయ్య, తిప్పని శ్రీశైలం, గటిక బస్వరాజం, రాజయ్య, బిల్లా ప్రభాకర్, కుమారస్వామి, తిప్పని సాంబయ్య, కరుణాకర్, బెడిద వీరన్న, వనపర్తి కరుణాకర్, చింతం రాజు, అచ్చె లక్షణ్, సుంచు వీరన్న, ఏసిరెడ్డి ప్రభాకర్ పాల్గొన్నారు.

# ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** గ్రామాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా నూతన సర్పంచులు అంకితభావంతో పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని పేరుమండ్లగూడెం గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన దూపెల్లి రాకేష్, ఉప సర్పంచ్ అనిల్ మరియు వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగరాజుకు గ్రామస్తులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అధికారుల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ రాకేష్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా సర్పంచ్ కృషి చేయాలన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనతో పాటు విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలపాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ముచినిపర్తి సర్పంచ్ ప్రమాణ స్వీకారం



**వరంగల్ వాయిస్, చిట్యాల : :** భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల పరిధిలోని ముచినిపర్తి గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా ఇంగిలి రాజేందర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారుల సమక్షంలో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు రాజ్యాంగబద్ధంగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు, అభిమానులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, గ్రామ పెద్దలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ ఫస్ట్ డే ఆన్ డ్యూటీ



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** 'ఫస్ట్ డే ఆన్ డ్యూటీ'.. పదవీ బాధ్యతలు చేపట్టిన తొలి రోజే తన మార్క్ చూపించారు చిల్కోడు నూతన సర్పంచ్ రాయల వెంకటేశ్వర్లు. పదవిని అలంకరించడమే కాకుండా, వెంటనే గ్రామ అభివృద్ధి పనులపై దృష్టి సారించి క్షేత్రస్థాయి పర్యటనకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో గత మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండిపోయిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ సోమవారం సందర్శించారు. నిర్మాణ పనులు ఏ కారణాల వల్ల నిలిచిపోయాయి? పనులను తిరిగి ప్రారంభించాలంటే తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? అనే అంశాలపై అక్కడికక్కడే పంచాయతీ కార్యదర్శి మరియు ఎంపీడీఓతో చర్చించారు. భవన నిర్మాణ ప్రస్తుత పరిస్థితిని, అవసరమైన నిధుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని సర్పంచ్ తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, నూతన పంచాయతీ భవనాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట ఉప సర్పంచ్ రమనబోయిన రాజు, గ్రామస్తులు కాడెం ప్రశాంత్, మంద వెంకన్న, గౌని సత్యం, మడ్డి సతీష్, రాజు, రామూర్తి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

# గణితంతోనే ఉజ్వల భవిష్యత్తు

■ సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి



**వరంగల్ వాయిస్, రేగొండ :** గణిత శాస్త్రంపై పట్టు సాధించిన విద్యార్థులకు భవిష్యత్తులో అద్భుతమైన అవకాశాలు ఉంటాయని జగ్గయ్యపేట నూతన సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జగ్గయ్యపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం ప్రదర్శన, ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతాదేవి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో పుట్టి, కేవలం తన మేధస్సుతో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన రామానుజన్ జీవితం నేటి విద్యార్థులకు గొప్ప ప్రేరణ అని కొనియాడారు. విద్యార్థులు గణితాన్ని ఇష్టపడి చదవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంటేరు చంద్రశేఖర్ మాట్లాడుతూ, గణితం అంటే భయం పోగొట్టేందుకు బోధనా పరికరాలు (టీఎల్ఎం) ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న సూత్రాలను నమూనాల రూపంలో ప్రదర్శించడం ద్వారా వారిలో సృజనాత్మకత పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల గణిత నమూనాలు, చార్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ నమూనాల పనితీరును అతిథులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దారవేన సరూప రమేష్, గంటా మహిపాల్, ఓడ్డాల శ్రీకాంత్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు పొనుగోటి వీరబ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు ముడుపు అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు గిరిధరకృష్ణ, రాజేందర్, చక్రధర్ రావు, కుమారస్వామి, శ్రీధర్, కోటిలింగం, కల్పనకుమారి, మహేందర్, శిరీష, శ్రీనివాస్, మాధవి, ప్రతాప్, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగాలి



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నూతన సర్పంచులు అంకితభావంతో పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. సోమవారం ఉమ్మడి రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, నూతన ప్రజాప్రతినిధులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రేగొండ సర్పంచ్‌గా వారణాశి మౌనిక అజయ్ (అంజి) పదవీ బాధ్యతలు చేపట్టారు. జగయ్యపేట సర్పంచ్‌గా నడిపెల్లి శాంతదేవీ వెంకట్రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, జిల్లా నాయకులు గండి తిరుపతి గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, యూత్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రికార్డు మెజారిటీని గ్రామాభివృద్ధికే అంకితం చేస్తా

### సర్పంచ్ మాచర్ల కుమారస్వామి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** భీమదేవరపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా మాచర్ల కుమారస్వామి సోమవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రమాణస్వీకారం చేశారు. ఇప్పటివరకు గ్రామంలో ఎవరికీ రానంత భారీ మెజారిటీతో తనను గెలిపించిన ప్రజలందరికీ ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తూ, తన కృతజ్ఞతలు తెలిపారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ.. “ఎన్నికల వరకే రాజకీయాలు, ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యాయి. ఇకపై అందరం కలిసికట్టుగా, ఒక ప్రణాళికాబద్ధంగా గ్రామాభివృద్ధి కోసం పనిచేద్దాం. గ్రామంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయను” అని హామీ ఇచ్చారు. సర్పంచ్‌గా తనకు ప్రతి నెల వచ్చే గౌరవ వేతనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడకుండా, గ్రామ పంచాయతీ నిధికి అందజేస్తానని వెల్లడించారు. గ్రామ అభివృద్ధియే తన ఏకైక లక్ష్యమని, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో భీమదేవరపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## శాస్త్ర సాంకేతిక ఎదుగుదలకు గణితమే మూలం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మనిషి శాస్త్ర పరంగా ఎదగడానికి గణితం పునాది వంటిదని డోర్నకల్ మండల విద్యాధికారి లక్ష్మా నాయక్ అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని కన్నెగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మా నాయక్ మాట్లాడుతూ.. రామానుజన్ స్వయంకృషితో గణితంలో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించారని, ఆయన జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. తార్కిక ఆలోచనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలు గణితం ద్వారానే అలవడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మాధవ రావు, నర్సయ్య, నాగమణి, శ్రీను, రామూర్తి, వనజ శ్రీ, రాజేశ్వరి, దస్తగిరి, నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాసరి యశ్వంత్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో ఇటీవల నిర్వహించిన షూటింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించి పద్మశాలి సామాజిక వర్గానికి కీర్తి తెచ్చిన దాసరి యశ్వంత్‌ను తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఘనంగా సన్మానించింది. హన్మకొండ హంటర్ రోడ్‌లోని నేత హాస్టల్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. దాసరి విజయ్ –సరస్వతి దంపతుల కుమారుడైన యశ్వంత్, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు గాను సంఘం నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది జనవరిలో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న ‘ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ గేమ్స్’కు యశ్వంత్ ఎంపికయ్యారు. ఈ మెగా ఈవెంట్‌లో యశ్వంత్ అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించాలని, రాష్ట్రానికి, పద్మశాలి సమాజానికి పేరు తేవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ బిట్ల వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు, రామా రవీందర్, చిమ్మని రాజన్ బాబు, వంగరి కోటేశ్వరరావు, కొండబత్తుల రాజేంద్రన్, కొండబత్తుల రాజమౌళి పాల్గొన్నారు. అలాగే ఉద్యోగుల సంఘం నాయకులు గుర్రపు రాజమౌళి, బొద్దున వెంకటేశ్వర్లు, గోరంట్ల అశోక్, శేఖర్ తదితరులు పాల్గొని యశ్వంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కోచ్ ఫ్యాక్టరీ భూ నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేటలో దశాబ్దాల పోరాటం తర్వాత సాధించుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు త్యాగం చేసిన రైతు కుటుంబాలకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం మడికొండ గ్రామంలో మాలోతు శంకర్ అధ్యక్షతన జరిగిన సీపీఐ కాజీపేట మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అయోధ్యపురంలో కోచ్ ఫ్యాక్టరీ కోసం 114 మంది రైతులు సుమారు 160 ఎకరాల భూమిని ఇచ్చారని, అయితే వారికి చెల్లింపుల విషయంలో పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని జ్యోతి ఆరోపించారు. ఎకరానికి రూ. 33 లక్షలుగా లెక్కకట్టి, కేవలం రూ. 8 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన రూ. 25 లక్షలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ 9 ఎకరాల భూమికి సంబంధించి ఎనిమిది మంది రైతులకు ఒక్క పైసా కూడా అందలేదని విమర్శించారు. అభివృద్ధి పేరుతో పేదల భూములను లాక్కుని, వారిని కూలీలుగా మార్చడం సరైనది కాదని ఆమె హితవు పలికారు. భూ నిర్వాసితుల కుటుంబ సభ్యులకు రైల్వేలో ఉద్యోగాలు కేటాయించాలి. ఫ్యాక్టరీ ప్రాంతంలో ఏర్పాటు చేసే స్టాల్స్‌లో నిర్వాసితుల కుటుంబాలకు స్వయం ఉపాధి కోసం అవకాశం ఇవ్వాలి. మార్కెట్ ధర ప్రకారం పూర్తి పరిహారం అందజేయాలి. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బీకేఎంయూ జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మునిగాల బిక్షపతి, నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్, దుస్సా వెంకటేశ్వర్లు, భూ నిర్వాసితులు మామిండ్ల బిక్షపతి, శ్రీకాంత్, మల్లయ్య, రాజు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మిత్ర కార్పొరేషన్ నూతన కమిటీ ఎన్నిక

• అధ్యక్షుడిగా డాక్టర్ విష్ణువర్ధన్ ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని మిత్ర కార్పొరేషన్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడిపికొండ రోడ్డులోని సాయినాథ్ ఎంక్లేవ్‌లో నిర్వహించిన కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశం, ప్రస్తుత అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభంలో ప్రధాన కార్యదర్శి నోముల సదానందం గత రెండేళ్ల కార్యదర్శి నివేదికను, కోశాధికారి కాసం రాజు ఆదాయ వ్యయాల నివేదికను సభ్యుల ముందు ఉంచారు. సభ్యులు అందించిన పలు సలహాలు, సూచనల మేరకు కొన్ని సవరణలతో ఈ నివేదికలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. 2010లో ప్రారంభమైన మిత్ర కార్పొరేషన్ సభ్యులందరి సహకారంతో విజయవంతంగా 15 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గర్వకారణమన్నారు. సభ్యుల ఆర్థికాభివృద్ధికి, పొదుపు అలవాటును పెంపొందించడానికి, కుటుంబ అవసరాలకు ఈ కార్పొరేషన్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్పొరేషన్ సభ్యుడు కట్కూరి స్వర్జన్ రాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించి, నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడిగా జడల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి నోముల సదానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాదారపు రాము, కోశాధికారి కాసం రాజు, కార్యవర్గ సభ్యులుగా దూదాటి శ్రీనివాసులు, సరస్వతిభట్ల సతీష్ లు ఎన్నికయ్యారు. రాబోయే కాలంలో సభ్యుల సూచనలకు అనుగుణంగా కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం సభ్యులందరూ నూతన కమిటీకి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.




# 24న మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

కన్నడ భామ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ మైసా. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక మందన్నా ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపించనున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. తాజాగా మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. మైసా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని పోస్టర్లతో తెలుస్తోంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో పాన్ ఇండియా మార్కెట్‌ను షేక్ చేసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతున్నదన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తుండగా.. కల్కి 2898 ఏడీ చిత్రానికి పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. కేరళలోని అథిరప్పిల్లీలో షూటింగ్ షురూ అయినట్టు ఇప్పటికే మేకర్స్ అప్‌డేట్ అందించారు.



# దేశభక్తి ఒక్కటే కాదు.. కథాబలం కూడా ముఖ్యం

**ఛావా విజయంపై నటుడు విక్కీ కౌశల్**

'ఛావా', 'ధురంధర్'.. ఈ రెండు సినిమాలు ఊహించని స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ సినిమాల విజయానికి ప్రధాన కారణం వీటి నేపథ్యం మాత్రమేనని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ రెండూ దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కడం వల్లే విజయం సాధించాయంటూ వస్తోన్న కామెంట్స్‌పై విక్కీ కౌశల్ స్పందించారు. అలా అనడం సరికాదని.. నేపథ్యంతో పాటు వీటిలో ఎన్నో ఎమోషనల్ సన్నివేశాలు ఉన్నాయని అన్నారు. 'దేశభక్తి.. సినిమా విజయాలకు ఇది ఒక ఫార్ములా కాదు. అలా చెబితే అవమానించడమే అవుతుంది. దేశభక్తి నిర్వచించలేని ఓ అనుభూతి. దాన్ని మన సినిమాలు, సాహిత్యం, క్రీడలతో నిరంతరం చాటుకుంటూనే ఉండాలి. దేశంపై మనకున్న గౌరవం, ప్రేమకు నిదర్శనమే ఇలాంటి చిత్రాలు. మన దేశం గొప్పతనాన్ని ప్రపంచం ముందు చాటిచెప్పడానికి ఇదో మార్గం. 'ఛావా' లాంటి గొప్ప చిత్రంలో నటించినందుకు నాకెంతో గర్వంగా, ఆనందంగా ఉంది' అని విక్కీ కౌశల్ అన్నారు. శంభాజీ మహారాజ్ వీరగాథగా విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఛావా' లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ ఫిల్మ్ ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.807 కోట్లు వసూలు చేసింది. ఇక తాజాగా వచ్చిన 'ధురంధర్' శత్రుదేశమైన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల్ని మూలాలతో సహా పెకిలించి.. అంతమొందించేందుకు భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చేపట్టిన రహస్య ఆపరేషన్ నేపథ్యంలో రూపొందింది. దేశభక్తి అంశాలతో ముడిపడిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ 17 రోజుల్లో రూ.845 కోట్లు వసూలు చేసినట్లు చిత్రబృందం తెలిపింది.




# అనిల్ రావిపూడి అదుర్స్

**ఏఐతో ప్రచార వీడియో వైరల్**

సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి అనుసరిస్తున్న వైఖరి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తనదైన పంథాలో కొత్త ఐడియాలను అప్లై చేస్తూ, ప్రతి సినిమాను విడుదలకు ముందే ట్రెండింగ్‌లో ఉంచడంలో అనిల్ దిట్ట. ప్రస్తుతం ఆయన మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' విషయంలో కూడా ఇదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచే వరుసగా క్రియేటివ్ ప్రమోషనల్ వీడియోలు రిలీజ్ చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు అనిల్. సినిమాతో సంబంధం ఉన్న ప్రతి అంశాన్ని ప్రమోషన్‌గా మార్చి వైరల్ చేయడంలో మరోసారి తన మార్క్ చూపిస్తున్నారు. లేటెస్ట్‌గా అనిల్ రావిపూడి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని కూడా తన సినిమా ప్రమోషన్స్ కోసం వినియోగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అలా నేను చూస్తూ పెరిగిన మెగాస్టార్ నుంచి? ఇలా నేను డైరెక్ట్ చేసే మెగాస్టార్ వరకు' అంటూ అనిల్ షేర్ చేసిన ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇందులో చిరంజీవి కెరీర్‌లోని క్లాసిక్ సినిమాలు.. ఖైదీ, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, జగదేకవీరుడు అతిలోక సుందరి, ముఠామేస్త్రీ, అంజి, ఇంద్ర, శంకర్ దాదా ఎంబీబీఎస్, ఠాగూర్ వంటి చిత్రాల సెట్స్‌కు అనిల్ వెళ్లినట్టుగా ఏఐ వీడియోను రూపొందించారు. మెగాస్టార్‌తో కలిసి ఉన్నట్టుగా చూపిస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. వింటేజ్ చిరుని పరిచయం చేస్తూ రూపొందించిన ఈ వీడియో మెగా అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తోంది అదే సమయంలో కొంత మంది నెటిజన్లు మాత్రం 'అనిల్ ప్రమోషన్ స్ట్రాటజీ మామూలుగా లేదు? సినిమా కోసం ఏదీ వదలడం లేదుగా' అంటూ కామెంట్లు చేస్తున్నారు. .నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 12న భారీ స్థాయిలో విడుదల కానుంది. అలాగే వెంకీ మామ (వెంకటేష్) ఈ మూవీలో తొలిసారి చిరంజీవితో కలిసి గెస్ట్ రోల్‌లో కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



# 50 ఏళ్ల సినీ ప్రస్థానం

*** మరోమారు విడుదలైన పడయప్ప**
*** థియేటర్‌కు వెళ్లి చూసి థ్రిల్ అయిన రమ్యకృష్ణ**

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్‌లోనే ఎవర్ గ్రీన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'పడయప్ప' తెలుగులో 'నరసింహ'మరోసారి ప్రేక్షకులను అలరిస్తోంది. రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈ చిత్రాన్ని ఈ నెల 12న థియేటర్లలో రీ రిలీజ్ చేశారు. 1999లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించింది.రజనీకాంత్ సరసన సౌందర్య, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ముఖ్యంగా నీలాంబరి పాత్ర సినీ చరిత్రలో నిలిచిపోయింది. ఆ పాత్రకు ప్రాణం పోసిన రమ్యకృష్ణ నటన ఇప్పటికీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. రీ రిలీజ్ సందర్భంగా తాజాగా రమ్యకృష్ణ స్వయంగా థియేటర్లో 'పడయప్ప'ను వీక్షించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ 'ఫస్ట్ టైమ్ 'పడయప్ప' మూవీని థియేటర్లో చూశాను' అని పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రజనీకాంత్ ? రమ్యకృష్ణ మధ్య వచ్చే సీన్స్ ఇప్పటికీ అభిమానులకు ప్రత్యేకం. ముఖ్యంగా నీలాంబరి అజ్ఞాతవాసం ముగించుకుని, చాలా ఏళ్ల తర్వాత 'నరసింహ'ను ఎదుర్కొనే సీన్ సినీ చరిత్రలోనే ఐకానిక్‌గా నిలిచింది. డైలాగ్స్, బీజీఎం, ఇద్దరి నటన థియేటర్లో మరోసారి గూస్‌బంప్స్ తెప్పించాయి. ఆ సీన్ వచ్చిన సమయంలో థియేటర్లో ఫ్యాన్స్‌తో కలిసి రమ్యకృష్ణ కూడా ఆ క్షణాలను ఆస్వాదించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతూ, 'నీలాంబరి ఇస్ నాట్ జస్ట్ ఎ క్యారెక్టర్? ఇట్'స్ ఎ లెజెండ్' అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. రీ రిలీజ్ అయినప్పటికీ 'పడయప్ప'కు వస్తున్న రెస్పాన్స్ చూస్తే? ఈ సినిమా నిజంగా క్లాసిక్ అని మరోసారి నిరూపితమవుతోంది.



# ..అను నేను

- సర్పంచులుగా బాధ్యతల స్వీకరణ
- ముగిసిన ప్రత్యేక పాలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా గెలుపొందిన అభ్యర్థులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయా గ్రామ ప్రత్యేక అధికారులు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, పాలకవర్గ సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సర్పంచులకు గ్రామ ప్రత్యేక అధికారులు బాధ్యతలు అప్పగించారు. దీంతో గత రెండు సంవత్సరాలుగా గ్రామాల్లో ఉన్న ప్రత్యేక పాలన ముగిసింది. ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామ ప్రత్యేక అధికారులు, బంధు మిత్రులు శాలువాతో సర్పంచులతో పాటు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గం మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తామని, గ్రామస్తుల సహకారంతో అన్ని రంగాల్లో ముందుకు వెళ్తామని ప్రకటించారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులకు కలిసి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. పలు ప్రమాణ స్వీకారోత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### పెద్ద పెండ్యాలలో..

ధర్మసాగర్ మండలం, పెద్ద పెండ్యాల గ్రామ సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన తోట నాగరాజు ప్రామాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల నమ్మకంతో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన తోట నాగరాజుకు కడియం కావ్య శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా తోట నాగరాజు గత కొంత కాలంగా పనిచేస్తున్నారన్నారు. తోట నాగరాజుకి గ్రామ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేతోపాటు తనను ఎప్పుడూ కలిసి నిధులు మంజూరు కోరుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పాలనకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తోందన్నారు. గ్రామాలకు నేరుగా నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పెద్ద పెండ్యాల గ్రామ అభివృద్ధికి అవసరమైన సెంట్రల్ లైటింగ్, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, సంక్షేమ పథకాల అమలులో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో ముందుకు తీసుకువెళ్లాలని ఎంపీ సూచించారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఇంతే ఉత్సాహంతో ప్రతి ఒక్కరూ పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ తోట నాగరాజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఘనంగా సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఉచిత కృత్రిమ కాలు

☐ 27,28 తేదీల్లో పంపిణీ

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఐఏఎస్ రిటైర్డ్ అధికారి పరికిపండ్ల నరహరి స్థాపించిన ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవాన్ మహావీర్ ట్రస్ట్ వారి సౌజన్యంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాలు (ఆర్టిఫిషియల్ లింబ్) పంపిణీ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం డిసెంబర్ 27, 28 తేదీల్లో వరంగల్‌లోని కొత్తవాడ, ఎంపీ కాలనీ, పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ప్రాంగణంలో జరుగుతుందన్నారు. ఈ మేరకు సోమవారం బల్దియా కమిషనర్ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ శిబిరానికి వరంగల్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అర్హులైన దివ్యాంగులు పాల్గొనవచ్చని, ముందస్తు నమోదు తప్పనిసరి అని నిర్వాహకులు వెల్లడించారు. నమోదు, ఇతర వివరాల కోసం 9490133650, 9885981959, 9949446802, 7095915728 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమాజంలోని దివ్యాంగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవితాల్లో కొత్త వెలుగు నింపుకోవాలని ఆలయ ఫౌండేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈఓ రమేష్ బాబు, అడిషనల్ సీఈఓ రాజేంద్ర కుమార్, డిప్యూటీ సీఈఓ కీర్తి నాగార్జున, మట్ట రాజు, పరికిపండ్ల వేణు, గాజుల్లా సంపత్, కుసుమ సతీష్ బాబు, ముంద్రాతి వెంకటేశ్వర్లు, మంత్రి లింగమూర్తి, ఎలగం చిన్న కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.




## రాజ్యాంగ పరిరక్షణలో.. న్యాయవాదుల పాత్ర కీలకం

- జిల్లా జడ్జి పాటిల్ వసంత్
- ఘనంగా ఐఎల్ పీఏ తెలంగాణ 5వ రాష్ట్ర మహాసభలు

**వరంగల్ వాయిస్, కొత్తగూడెం :** ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన రాజ్యాంగాన్ని రక్షించడం ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని, ఈ బాధ్యతలో న్యాయవాదులు ముందుండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం క్లబ్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ 5వ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల కృషితోనే అట్టడుగు వర్గాలకు విద్య, హక్కులు లభించాయని, వారి ఆశయాల వల్లే నేడు తాము ఈ స్థాయిలో ఉన్నామని జడ్జి పేర్కొన్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.సరిత మాట్లాడుతూ.. రాజ్యాంగ హక్కుల ప్రచారంలో న్యాయవాదులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఎస్.బాలన్ (కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది) మట్లాడుతూ పాలకులు ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగ రక్షణలను అమలు చేయడం లేదని, న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం రావాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లలో బహుజన కోటా లేకపోవడం దుర్మార్గమని, ఆధిపత్య కులాల మహిళలకే ఇవి పరిమితం కాకుండా పోరాడాలని ప్రొఫెసర్ సుజాత సూరెపల్లి పిలుపునిచ్చారు. సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు ఈబీసీ రిజర్వేషన్ల వల్ల ఓబీసీలకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. మహాసభల ముగింపు సందర్భంగా 140 మందితో కూడిన నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.జె. శాంసన్ (సీనియర్ న్యాయవాది, హైదరాబాద్), ప్రధాన కార్యదర్శి: సాయిని నరేందర్ (హనుమకొండ బార్), గౌరవ అధ్యక్షులుగా దయాల రాజారాం, పొన్నం దేవరాజ్ గౌడ్, కోశాధికారిగా గాంగేయుడు (రంగారెడ్డి)లు ఎన్నికయ్యారు. నూతన ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ.. పూలే, అంబేద్కర్ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్తామని, "గడపగడపకు రాజ్యాంగం" కార్యక్రమం ద్వారా బహుజన సమాజాన్ని చైతన్యం చేస్తామని ప్రకటించారు. అంబేద్కర్ బోధించిన 'పే బ్యాక్ టు సొసైటీ' సిద్ధాంతం ద్వారా అనగారిన వర్గాలకు న్యాయవాదులు అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎల్ పీఏ జాతీయ అధ్యక్షురాలు సుజాత కె.చౌదంటే, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, వివిధ జిల్లాల ప్రతినిధులు, బాంసెఫ్ నాయకులు మరియు న్యాయవాద నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ బకాయిలు చెల్లించాలి

- పెన్షన్ వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి
- జాతీయ చైర్మన్ ఆర్ఎస్. శర్మ, సెక్రటరీ జనరల్ సుధాకర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా పెన్షనర్ల ఫెడరేషన్ చైర్మన్, సెక్రటరీ జనరల్ ఆర్ఎస్.శర్మ, డి.సుధాకర్, పూర్వ జాతీయ చైర్మన్ ఎస్ఎస్.దూబే, పూర్వ సెక్రెటరీ జనరల్ జి.పూర్ణచందర్, రాష్ట్ర అధ్యక్షులు ఎ.రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ జీపీఏటీ హనుమకొండ జిల్లా శాఖ నూతన మీటింగ్ హాలు ప్రారంభోత్సవం, 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు ఇ.నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా పెన్షనర్స్ ఫెడరేషన్ జాతీయ చైర్మన్ ఆర్ఎస్. శర్మ, సెక్రటరీ జనరల్ డి.సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మార్చి 2025 న పార్లమెంటులో ఆమోదింప చేసుకున్న పెన్షన్ వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా 1982 లో వైవీ.చంద్రచూడుతోపాటు ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం డీఎస్.నకార వేసిన కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పొందుతున్న ప్రయోజనాలన్నీ కూడా 1-1-2026 నుంచి ఈ చట్టం ప్రకారం వర్తించవనే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం దుర్మార్గమని ఆ చట్టాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం కనుక అమలైనట్లయితే భవిష్యత్తులో పెన్షనుదారులకు పీఆర్సీ కానీ డీఏలు కాని వర్తించవు. అదేవిధంగా మార్చి 2024 నుంచి నవంబర్ 2025 వరకు రిటైర్డ్ అయిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ న్యాయంగా రావలసిన రిటైర్మెంట్ బకాయిలు జీపీఎఫ్, జీఐఎస్, గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్కాష్మెంట్ లీవులు, సరెండర్ లీవులు, పీఆర్ సీ 2020 ఏరియర్స్, డీఏ బకాయిలు అన్నింటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు రిటైర్మెంట్ బకాయిలు అందక అప్పుల బాధతో బ్యాంకు రుణాలు చెల్లించలేక, మానసిక వ్యధతో, మానసికంగా కృంగిపోయి అనారోగ్యంతో దాదాపుగా 35 మంది పెన్షనర్లు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ జీపీఏటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రాజేంద్ర బాబు, ఎంవీ.నర్సింగారావు, ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ఉత్తర ప్రదేశ్ అధ్యక్షులు సత్య దేవ్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ సెక్రటరీ జనరల్ తులసి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు జి.వీరస్వామి, వి.రామ్ మనోహర్, టి.పురుషోత్తం, కె.సుధీర్ బాబు, అతిథులుగా హనుమకొండ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ కుమార్, ఆర్ అండ్ బీ రీజినల్ ఆఫీసర్ టి.రాఘవరెడ్డి, ఆర్ అండ్ బీ రెడ్డి రిటైర్డ్ సీఈ కె.జనార్ధన్, ప్రధాన కార్యదర్శి కె.సమ్మారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎల్.ప్రకాష్, చీఫ్ అడ్వైజర్ రత్నాకర్, ఆర్థిక కార్యదర్శి సూర్య ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు సింగారెడ్డి, సత్యనారాయణ, రమేష్, జ్యోతి, రమణి, రాధ, ఎల్.ప్రభాకర్ రెడ్డి, కె.దేవదాసు, వెంకటేశ్వర్లు, పి.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com